


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 28-02-2024 సంపుటి : 06 సంచిక : 170 పేజీలు : 8 వెల : రూ 3-00


## పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అసెంబ్లీ స్పీకర్ కీలక నిర్ణయం..

### 8 మంది ఎమ్మెల్యేలపై వేటు



విజయనగరం, ఫిబ్రవరి 27, పార్టీ ఫిరాయించారంటూ 8 మంది ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం కీలక నిర్ణయం తీసుకున్నారు.వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు ఆనం రాంనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవితోపాటు టీడీపీ రెబల్ ఎమ్మెల్యేలు కరణం బలరాం, వల్లభనేని వంశీ, మద్దాలి గిరిధర్, వాసుపల్లి గణేష్‌లపై అనర్హత వేటు పడింది. టీడీపీ, వైసీపీ విప్‌లు చేసిన ఫిర్యాదులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణలను పరిశీలించిన స్పీకర్, 8 మంది సభ్యులు పార్టీ ఫిరాయించినట్టు తేల్చారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేశారు.పార్టీ ఫిరాయించిన 8 మంది శాసన సభ్యులపై స్పీకర్ తమ్మినేని సీతారాం అనర్హత వేటు వేశారు. వీరిలో వైఎస్సార్‌సీపీ నుంచి నలుగురు, టీడీపీ నుంచి నలుగురు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి శాసనసభకు ఎన్నికై పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం అనర్హత వేటు వేయాలని కోరుతూ వైసీపీ చీఫ్ విప్ ముదునూరు ప్రసాదరాజు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ నుంచి శాసన సభకు ఎన్నికై పార్టీకి దూరంగా ఉంటున్న ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ విప్ డోలా బాల వీరాంజనేయస్వామి స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ రెండు పార్టీల ఫిర్యాదులపై విచారణ జరిపిన అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేల నుంచి వివరణలు తీసుకున్నారు. దీంతో 8 మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డట్లు తేల్చారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేశారు. స్పీకర్ ఆదేశాల మేరకు ఏపీ లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చట్ట ప్రకారమే చర్యలు: స్పీకర్ తమ్మినేని



గుంటూరు, ఎన్నికల ముందర అధికార, ప్రతిపక్ష పార్టీల్లో పార్టీ ఫిరాయించిన ఎనిమిది ఎమ్మెల్యేలపై అసెంబ్లీ స్పీకర్ అనర్హత వేటు వేయడం చర్చనీయాంశంగా మారింది.ఈ పరిణామంపై స్పీకర్ తమ్మినేని సీతారాం సాక్షితో స్పందించారు. నిష్పక్షపాతంగా తాను వ్యవహరించానని.. చట్ట ప్రకారమే నడుచుకున్నానని అన్నారాయన.పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై విచారణ ముగించాం. విచారణ అంతా నిబంధనల ప్రకారమే జరిగింది. వాదనలు వినిపించేందుకు వాళ్లకు తగిన సమయం ఇచ్చాం. కానీ, వాళ్లు ఆ అవకాశాన్ని వినియోగించుకోలేదు. కాబట్టే విచారణ ముగించి అనర్హత వేటు వేశాం.ఈ విషయంలో నేను నిష్పక్షపాతంగా వ్యవహరించా. చట్ట ప్రకారమే చర్యలు తీసుకున్నా అని తెలిపారాయన. అలాగే.. వైఎస్సార్‌సీపీలో చేరినవాళ్లపైనా చర్యలు తీసుకున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. "అనర్హత వేటు పడ్డవాళు కావాలనుకుంటే కోర్టుకు వెళ్లొచ్చు. మాదీ(అసెంబ్లీని ఉద్దేశించి..) కోర్టు లాంటిదే. ఇక వారిష్టం" అని స్పీకర్ తమ్మినేని అన్నారు.

# ఎన్నికల్లో ఓటమి తప్పదని వారికి తెలుసు: ప్రధాని మోడీ



**రానున్న ఎన్నికల్లో తమకు ఓటమి తప్పదని వారికి తెలుసు**
**దేశ ప్రగతికి ప్రతిపక్షానికి రోడ్‌మ్యాప్ లేదు**
**కాంగ్రెస్, కమ్యూనిస్టులు కేరళలో బద్ధ శత్రువులు**
**ఇతర ప్రాంతాల్లో జిగ్రీ దోస్తులు: విరుచుకుపడిన ప్రధాని మోడీ**

తిరువనంతపురం: కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి)కి వ్యతిరేకంగా బలమైన ప్రత్యామ్నాయ కూటమి ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలపై ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వారు కేరళలో బద్ధ శత్రువులని, కాని ఇతర రాష్ట్రాలలో 'చిరకాల ఉత్తమ మిత్రులు' (బిఎఫ్‌ఎఫ్‌లు) అని మోడీ పేర్కొన్నారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో బిజెపి రాష్ట్ర శాఖ పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో మాట్లాడిన మోడీ ప్రతిపక్షాల ధోరణిని ఆక్షేపించారు. దేశ పురోభివృద్ధి కోసం ప్రతిపక్షాల వద్ద రోడ్‌మ్యాప్ లేదని, అందుకే అవి రానున్నన లోక్‌సభ ఎన్నికలలో గెలవలేమని దృఢాభిప్రాయంతో ఉన్నాయని, ఆ కారణంగానే వాటి నేతలు తనను దుర్భాషలాడుతున్నారని మోడీ ఆరోపించారు.'కాంగ్రెస్, కమ్యూనిస్టులు కేరళలో పరస్పరం శత్రుభావంతో మెలగుతుంటాయి. కాని ఇతర రాష్ట్రాలలో అవి బిఎఫ్‌ఎఫ్‌లు అంటే చిరకాల ఉత్తమ మిత్రులు' అని ప్రధాని అన్నారు. కేరళ ముఖ్యమంత్రి (పినరయి విజయన్) అవినీతికి, కుంభకోణాలకు పాల్పడుతుంటారని కాంగ్రెస్ ఆరోపించిందని, వామపక్ష ప్రభుత్వాన్ని ఫాసిస్ట్‌గా ఆ పార్టీ అభివర్ణించిందని మోడీ చెప్పారు. 'అందుకు ప్రతిస్పందనగా కమ్యూనిస్టులు కాంగ్రెస్ కార్యకర్తలపై లాఠీచార్జి చేయించారని, ఆ పార్టీ పూర్వపు ప్రభుత్వాలకు వివిధ కుంభకోణాలలో ప్రమేయం ఉందని ఆరోపించారు. అయితే, కేరళ వెలుపల ఇండియా కూటమి సమావేశాలలో వారు కలసి కూర్చుంటారు, సమోసాలు, బిస్కట్లు తింటారు, తేనీరు తాగుతారు' అని మోడీ వాటి అసంబద్ధత గురించి ప్రస్తావిస్తూ చెప్పారు.'అందువల్ల తిరువనంతపురంలో వారు ఒక విషయం చెబుతారు. ఢిల్లీలో వేరే విధంగా మాట్లాడతారు. కేరళ ప్రజలు రానున్న లోక్‌సభ ఎన్నికలలో వారి నయవంచనకు సమాధానం ఇస్తారు' అని మోడీ అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలలో రెండు అంకెల సీట్లతో బిజెపిని ఆశీర్వదించాలని కేరళ ప్రజలకు మోడీ విజ్ఞప్తి చేశారు. వోటు బ్యాంకు కోణంలో ఏ రాష్ట్రాన్నీ బిజెపి చూడదని మోడీ నొక్కిచెబుతూ, గడచిన పది సంవత్సరాలలో ఇతర బిజెపి పాలిత రాష్ట్రాల వలె కేరళ అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనం పొందిందని ప్రధాని తెలియజేశారు. కేరళ ప్రజల కలలు, ఆకాంక్షల సాఫల్యానికి వీలుగా అన్ని విధాల కృషి చేస్తామని తాను గ్యారంటీ ఇస్తున్నానని మోడీ చెప్పారు.

# పదోతరగతి పరీక్షలకు సర్వం సిద్ధం..

### 3,473 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు!



అమరావతి, ఫిబ్రవరి 27: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3,473 ఎగ్జాం సెంటర్లను సిద్ధం చేసినట్లు తెలిపింది.పదో తరగతి ప్రధాన పరీక్షలు మార్చి 28వ తేదీతో ముగుస్తాయి. మిగతా రెండు రోజుల్లో ఓరియంటల్, ఒకేషనల్ పరీక్షలు ఉంటాయి. 2023-24 విద్యా సంవత్సరానికి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 6,23,092 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు నమోదు చేసుకున్నారు. వీరిలో గత ఏడాది పదో తరగతి ఫెయిలై తిరిగి ప్రవేశం పొందినవారు 1,02,528 మంది వరకు ఉన్నారు. ఇక ఓరియంటల్ విద్యార్థులు 1,562 మంది ఉన్నారు. మొత్తం పదో తరగతి విద్యార్థుల్లో 3,17,939 మంది బాలురు, 3,05,153 మంది బాలికలు ఈ ఏడాది పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు.ఆయా తేదీల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.15 గంటలకు పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 8.45 గంటల నుంచి 9.30 గంటలకు వరకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ప్రత్యేక సందర్భాల్లో మరో 30 నిమిషాలు అంటే ఉదయం 10గంటల వరకు అనుమతించే అవకాశం ఉంది. 156 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 682 సిట్టింగ్ స్క్వాడ్స్‌ను అధికారులు సిద్ధంచేశారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాల వద్ద స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారులు సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమిస్తారు. 130కి పైగా పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేశారు. ఇలా ఈ సారి జరిగే పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణ కోసం అధికారులు ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేశారు. అలాగే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే ద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్‌ను చూపించి పరీక్ష కేంద్రాలకు బస్సుల్లో ఉచితంగా వెళ్లి, రావొచ్చని తెలిపారు. ఈ సదుపాయం ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కూడా వర్తిస్తుందని అధికారులు తెలిపారు.పదో తరగతి పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా అధికారులు ప్రత్యేక టెక్నాలజీ ఏర్పాటు చేశారు. రూపొందించారు. ప్రతి పేపర్‌కు, ప్రతి ప్రశ్నకు క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. దీంతో మాల్ ప్రా?క్టీస్ చేసినా, పేపర్ లీక్ అయినా వెంటనే ఏ జిల్లాలోని ఏ మండలానికి చెందిన ఎగ్జాం సెంటర్‌లో ఏ విద్యార్థికి కేటాయించిన పరీక్ష పేపర్ అనేది నిమిషాల్లో తెలిసిపోతుంది. అంతేకాకుండా పరీక్ష కేంద్రాల్లోకి ఇన్విజిలేటర్లతోపాటు విద్యాశాఖ అధికారులు, నాన్-టీచింగ్ సిబ్బంది, పోలీసులు, చీఫ్ ఇన్విజిలేటర్లు.. ఎవ్వరికీ కూడా పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకువెళ్లకుండా నిషేధించారు. పరీక్షల అనంతరం మార్చి 31 నుంచి ఏప్రిల్ 8 వరకు స్పాట్ వ్యాల్యూషన్ పూర్తి చేస్తారు. అలాగే గతంలో రీ కౌంటింగ్, రీ వ్యాల్యూషన్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఫలితాలు తెలుసుకునేందుకు సంబంధిత సబ్జెక్ట్ పేపర్ వారి చేతికి ఇచ్చేవారు. ఈ ఏడాది అలాంటి వారికి వెబ్ లింక్ పంపించనున్నారు. సదరు లింక్‌ను ఓపెన్ చేస్తే పేపర్ సాఫ్ట్ కాపీని స్క్రీన్‌పై చూసుకునేలా ఏర్పాట్లు చేశారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కేంద్రం 'మరో ఆలోచన'.. పురందేశ్వరి కీలక వ్యాఖ్యలు


విశాఖపట్టణం, ఫిబ్రవరి 27 విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్‌పై ఏపీ బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు పురంధేశ్వరి కీలక వ్యాఖ్యలు చేశారు.విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు బదులు లాభాల బాటలోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన వివరాలను కేంద్ర ఉక్కు శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియా మూడురోజులకు ఒకసారి వివరాలు తెప్పించుకుంటున్నారని చెప్పారు. అలాగే విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు విషయంలోనూ కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని చెప్పారు.



రైల్వే జోన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్థలం ఇవ్వలేదని, అందుకే ఆలస్యం అవుతోందన్నారు. రైల్వే జోన్‌కు భూములు ఇవ్వాలని స్వయంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఏపీ ప్రభుత్వాన్ని కోరినట్లు తెలుస్తోంది. భూములు ఇవ్వకపోగా కేంద్ర ప్రభుత్వాన్ని ఈ విషయంలో నిందించడం సరికాదన్నారు. ఆంధ్రాలో మరోసారి అనేదే తమ నినాదంగా పురందేశ్వరి పేర్కొన్నారు.

## 15 లోక్‌సభ స్థానాలకు సిపిఎం అభ్యర్థుల ప్రకటన

తిరువనంతపురం: కేరళలోని 15 లోక్‌సభ స్నాలకు అధికార సిపిఎం మంగళవారం అభ్యర్థులను ప్రకటించింది. సిపిఎం ప్రకటించిన అభ్యర్థులలో మాజీ రాష్ట్ర మంత్రులు కెకె శైలజ, టిఎం థామస్ ఇసాక్ కూడా ఉన్నారు. వామపక్ష కూటమిలో భాగస్వామ్య పక్షాలైన సిపిఐ, కేరళ కాంగ్రెస్(ఎం) ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించాయి.కీలక నియోజకవర్గాలలో దేవస్థానం మంత్రి కె రాధాకృష్ణన్‌తోసహా నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను సిపిఎం లోక్‌సభ అభ్యర్థులుగా ప్రకటించింది. ఎమ్మెల్యేగా గెలిచిన సినీ నటుడు ముకేష్‌తోపాటు వి జాయ్ కూడా లోక్‌సభకు పోటీ చేస్తున్నారు. సిట్టింగ్ ఎంపీలు ఎఎం ఆరిఫ్(లోక్‌సభ), ఎలమారమ్ కరీం(రాజ్యసభ) సిపిఎం లోక్‌సభ అభ్యర్థుల జాబితాలో ఉన్నారు.



సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ మంగళవారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించారు.

# సంపాదకీయం

బుధవారం 28-02-2024

## ముంచుకొస్తున్న ఎల్‌నినో ప్రభావం...

పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ఏర్పడింది. ఈ విషయాన్ని ప్రపంచ వాతావరణ సంస్థ ప్రకటించగా దీని ప్రభావం వల్ల లాటిన్ అమెరికా దేశాలతో పాటు ఇతర దేశాల్లో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. వాతావరణంపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రుతుపవనాల రాకకు ఇంకా మూడు నెలల సమయం వున్నప్పటికీ ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. 2024లో మార్చి నుంచి మే నెలల మధ్య సూపర్ ఎల్ నినో ప్రపంచాన్ని దెబ్బతీసే సూచనలున్నాయి. అమెరికాకు చెందిన ఎన్‌ఓఏ(నేషనల్ ఓషెనిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్) సూపర్ ఎల్ నినో వచ్చే అవకాశం ఉందిన కొద్దిరోజుల కిందట అంచనా వేసింది. మార్చి నుంచి మే వరకూ వేసవి కాలం. ఈ కాలంలోనే ఎల్ నినో అత్యంత తీవ్రస్థాయికి చేరుకునే అవకాశం ఉంది. ఎన్‌ఓఏ చేసిన వాతావరణ సూచనల ప్రకారం, 2024 మార్చి నుంచి మే నెలల మధ్య సూపర్ ఎల్ నినో ప్రభావం కనిపించే అవకాశం ఉంది. తీవ్రమైన ఎల్ నినో కనిపించే అవకాశం 70 నుంచి 75 శాతం వరకూ ఉన్నట్లు అంచనా వేసింది. ఆ సమయంలో భూమధ్యరేఖ సమీపంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా కేవలం 2 శాతం ఉష్ణోగ్రతలు పెరిగినా అది 30 శాతం కంటే ఎక్కువగా పెరిగినట్లే. 1972?73, 1982?83, 1997?98 మరియు 2015?16లోనూ ఇలాంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు అనేక దేశాలు తీవ్రమైన ఉష్ణోగ్రతలు, కరవు, వరదల వంటి విపత్తులను ఎదుర్కొన్నాయి. ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో ఒక రకమైన కాలానుగుణ మార్పు. ఈ ఎల్‌నినో వల్ల శీతాకాలాలు కూడా వెచ్చగా ఉంటాయి. వర్షం లేకుండా వేసవి కాలం మరింత వేడిగా మారనుంది. ఇక అవి మాత్రమే కాదు, దాని వల్ల రుతుపవనాలు కూడా బలహీనంగానే ఉన్నాయి. గత 20 ఏళ్లలో సంభవించిన కరవులన్నీ ఎల్‌నినో సంవత్సరాల్లోనే సంభవించాయని ఎంకె గ్లోబల్ పరిశోధనా నివేదిక చెబుతోన్న క్రమంలో ఈ సంవత్సరం వ్యవసాయోత్పత్తులు తక్కువగా ఉండవచ్చని అంటున్నారు. ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని పరిశోధన నివేదికలు హెచ్చరిస్తున్నాయి. అమెరికా నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ గత ఏడాది జూన్ నుంచి డిసెంబర్ మధ్య ఎల్‌నినో ప్రభావం 55 నుండి 60 శాతం వరకు ఉంటుందని అంచనా వేసింది. ఎల్‌నినో, లానినా అనేవి వాతావరణ పరిస్థితులకు సంబంధించినవి అనే సంగతి చాలా మందికి తెలుసు. కానీ అవి నిర్దిష్టంగా ఎందుకు ఏర్పడుతాయనే విషయం చాలా మందికి తెలియదు. నిజానికి శాస్త్రవేత్తలకు కూడా పూర్తిగా వీటి గురించి క్లారిటీ లేదనడం అతిశయోక్తి కాదు. ఎల్‌నినో అంటే వర్షాభావ పరిస్థితి కాగా, లానినా అంటే విపరీతంగా వర్షాలు కురిసే పరిస్థితి అనే ఒక్క మాటలో చెప్పే వివరణ. ఎల్‌నినో అంటే పెరూ తీరంలో ప్రతి 3 నుంచి 5 సంవత్సరాలకోసారి పసిఫిక్ జలరాశి అనూహ్యంగా వేడెక్కే స్థితి. ఎల్‌నినో అనేది ఒక స్పానిష్ (లాటిన్) పదం. లాటిన్ భాషలో ఎల్‌నినో అంటే క్రీస్తు శిశువు జననం. దీని కారణంగా భారత, ఆగ్నేయ ఆసియా దేశాల్లో రుతుపవన వ్యవస్థ దెబ్బతిని వర్షపాత పరిమాణం తగ్గుతుంది. మూడేళ్ళుగా పసిఫిక్‌పై వరుసగా లానినో పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ లానినో గత ఏడాది సెప్టెంబర్‌తో పూర్తయిపోయింది. ఇప్పుడు ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో భారత్‌లోకి ప్రవేశించే నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే తక్కువ వర్షపాతాన్ని ఇచ్చే అవకాశం ఉన్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఈ ఎల్‌నినో 2027 వరకు కొనసాగుతుందని ఐరాస వాతావరణ విభాగం హెచ్చరించింది. దీని వల్ల భారత్ సహా చాలా దేశాల్లో కరవు పరిస్థితులు ఏర్పడవచ్చని, ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతాయని హెచ్చరించింది. ఎల్‌నినో పరిస్థితి ఎన్నడూ ఒకేలా ఉండదు. ప్రతి ఎల్‌నినో విభిన్నమైందే. ఒక్కోటి ఒక్కోలా ప్రభావం చూపుతుంది. ఎల్‌నినోతో వరదలు, కరవులు సంభవించడమే కాదు వాతావరణం వేడెక్కడం మరో సమస్య. పసిఫిక్ ఉపరితలం అధికంగా వేడెక్కడం వల్ల వాతావరణంలోకి పెద్ద మొత్తంలో శక్తి విడుదలవుతుంది. ఫలితంగా తాత్కాలికంగా ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఎల్‌నినో సమయంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడానికి కారణమిదే. ప్రపంచంలోనే అతిపెద్దదైన పసిఫిక్ మహాసముద్రంలో బలంగా వీచే గాలులు, వాటి దిశ, ఉష్ణోగ్రత వంటి అంశాలు మొత్తం ప్రపంచ వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తాయవాతావరణంలో ఎల్ నినో ప్రభావం ఉన్నప్పుడే భారత్‌లో కరవు పరిస్థితులు ఏర్పడినట్లు గత అనుభవాలు చెబుతున్నాయి. అదే తరహాలో, ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉండనున్న నేపథ్యంలో దేశంలో కరవు పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంది. భారత్‌లో వర్షపాతానికి, ఎల్ నినోకు అవినాభావ సంబంధం ఉన్నట్లు మీడియా నివేదికలతో అర్థమవుతోంది. ఎందుకంటే, 1981 నుంచి ఇప్పటి వరకూ దేశంలో తలెత్తిన కరవు పరిస్థితులు 6 ఎల్ నినోల కాలంలోనే జరిగాయి. చివరగా 2002, 2009 కరవు పరిస్థితుల సమయంలోనూ ఎల్ నినోలు చురుగ్గా ఉన్నాయి. అయితే ఇందులో ఆసక్తికరమైన విషయం ఏంటంటే, భారత్‌లో కరవు పరిస్థితులు తలెత్తినప్పుడు ఎల్ నినో దాదాపుగా యాక్టివ్‌గా ఉంది. కానీ, ఎల్ నినో యాక్టివ్‌గా ఉన్న ప్రతి ఏటా భారత్‌లో కరవు పరిస్థితులు ఏర్పడలేదు. ఉదాహరణకు, 1997 - 98లో ఎల్ నినో ప్రభావం తీవ్రస్థాయిలో ఉన్నప్పటికీ దేశంలో కరవు పరిస్థితి లేదు. ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాల మధ్య విస్తరించి ఉండే పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడే ప్రత్యేక సముద్ర పవనాలు ఈ ఎల్‌నినో, లానినాలకు కారణం అవుతాయని అంచనా. పసిఫిక్ మహాసముద్రంలో, సాధారణ పరిస్థితుల్లో, గాలులు భూమధ్యరేఖ ద్వారా పశ్చిమంగా వీస్తాయి. అలా జరగడం వలన దక్షిణ అమెరికా నుండి వెచ్చని నీరు ఆసియా వైపు వస్తుంది. సముద్రపు లోతుల నుండి పైకి వచ్చే చల్లటి నీరు వెచ్చని నీటితో ప్రవహించే ఖాళీ స్థలాన్ని నింపుతుంది. అలాంటి ప్రాసెస్‌ను అప్‌వెల్లింగ్ అంటారు. ఎల్ నినో సహా లానినా ఈ పరిణామాన్ని నాశనం చేస్తాయి. అదే ఎల్‌నినో ప్రభావం ఉంటే జూన్ అక్టోబర్ మధ్య భారత దేశంలో రుతుపవనాలు ప్రభావితమవుతాయని అంటున్నారు.

## పతంజలి తప్పుడు ప్రకటనల కేసు:కేంద్రం కళ్లు మూసుకుపోయాయంటూ సుప్రీం ఆగ్రహం




ఢిల్లీ,: ప్రముఖ ఆయుర్వేద సంస్థ పతంజలి ప్రకటనలపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు మంగళవారం విచారించింది. అయితే.. తప్పుదోవ పట్టిస్తున్న పతంజలి ప్రకటనల విషయంలో ప్రభుత్వం ఇంతకాలం కళ్లు మూసుకుని కూర్చుందని దేశ సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర స్థాయిలో మండిపడింది. అంతేకాదు ఇలాంటి ప్రకటనల విషయంలో ఇంకా జాప్యం వద్దని.. కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందంటూ కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది. పతంజలి తప్పుడు ప్రకటనలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు ఇవాళ విచారణ జరిపింది. ఈ క్రమంలో తప్పుదోవ పట్టించే వైద్య ప్రకటనల సమస్యకు పరిష్కారం కనుగొనాలంటూ కేంద్రం తరఫు న్యాయవాదిని అత్యున్నత న్యాయస్థానం కోరింది. ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్‌కు చెందిన పతంజలి ఆయుర్వేద సంస్థకు గతంలోనే సుప్రీంకోర్టు వార్నింగ్ ఇచ్చింది. హెర్బల్ ఉత్పత్తులపై మోసపూరిత ప్రకటనలు చేస్తే ఒక్కొక్క ఉత్పత్తిపై భారీ జరిమానా తప్పదని తెలిపింది. కంపెనీ చేస్తున్న నిరాధారమైన, మోసపూరితమైన ప్రకటనలను ఆపివేయాలని, లేకపోతే ఆ సంస్థ తయారు చేసే ఒక్కో ఉత్పత్తిపై కోటి రూపాయల చొప్పున జరిమానా విధిస్తామని తీవ్రంగా హెచ్చరించింది. అంతేకాదు..ఆ యాడ్స్‌ను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది కూడా. తమ ఉత్పత్తుల వల్ల కొన్ని వ్యాధులు నయం అవుతాయంటూ పతంజలి కంపెనీ కొన్ని ప్రకటనలు ఇస్తూ వచ్చింది. ఈ ప్రకటనలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కిందటి ఏడాది ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కోర్టులో కేసు వేసింది. ఆ ప్రకటనలు డాక్టర్లను కించపరిచేలా ఉన్నాయంటూ పేర్కొంది. ఈ పిటిషన్ పైనే ధర్మాసనం విచారణ జరిపింది. ఆధునిక అలోపతి వైద్యాన్ని, ఆ విధానాన్ని అనుసరించే డాక్టర్లను కించపరిచేలా..నిరాధార ఆరోపణలు చేస్తున్న పతంజలి ఆయుర్వేద సంస్థ ఉత్పత్తులను, ఆ ఉత్పత్తుల వ్యాపార ప్రకటనలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది. పతంజలి సంస్థ డాక్టర్లపై కించపరిచేలా వ్యవహరించటం సరికాదని ఈ సందర్భంగా ధర్మాసనం సూచించింది. ప్రజలను తప్పుదారి పట్టించేలా ఇలాంటి ప్రకటనలు చేయవద్దని పతంజలి సంస్థను సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేకాదు.. ఆ ఆయుర్వేద సంస్థ చేస్తున్న అసత్య ప్రచారాన్ని అడ్డుకునే మార్గాన్ని కనిపెట్టాల్సిందిగా సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.

## గగన్ యాన్ మిషన్ లో ఆ నలుగురు.. వ్యోమగాముల పేర్లను వెల్లడించిన మోదీ

మానవ అంతరిక్ష యాత్ర 'గగన్ యాన్' కోసం శిక్షణ పొందుతున్న నలుగురు పైలట్ల పేర్లను ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ప్రకటించారు. పైలట్లు ? గ్రూప్ కెప్టెన్ పి బాలకృష్ణన్ నాయర్, గ్రూప్ కెప్టెన్ అజిత్ కృష్ణన్, గ్రూప్ కెప్టెన్ అంగద్ ప్రతాప్, వింగ్ కమాండర్ ఎస్ శుక్లా గా అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా నలుగురు వ్యోమగాములను ప్రధాని అభినందించారు. ఈ రోజు ఈ వ్యోమగాములను కలుసుకుని దేశం ముందు ప్రదర్శించే అవకాశం లభించినందుకు సంతోషంగా ఉందన్నారు. యావత్ దేశం తరఫున వారిని అభినందిస్తున్నాను. నేటి భారతదేశానికి గర్వకారణం' అని ప్రధాని మోదీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన విజయం దేశ యువతలో శాస్త్రీయ స్వభావానికి బీజం వేస్తోందన్నారు. కేరళలోని తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్సీ)ను సందర్శించిన ప్రధాని మోదీ అక్కడ గగన్యాన్ మిషన్ పురోగతిని సమీక్షించారు. ఆయన వెంట కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కేంద్ర మంత్రి మురళీధరన్, ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ ఉన్నారు. గగన్ యాన్ మిషన్ భారతదేశం మొదటి మానవ సహిత అంతరిక్ష యాత్ర. ఇది 2024-2025 మధ్య ప్రయోగాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. మూడు రోజుల మిషన్ కోసం ముగ్గురు బృందాన్ని 400 కిలోమీటర్ల కక్ష్యలోకి ప్రవేశపెట్టి, భారత సముద్రంలోకి దిగడం ద్వారా వారిని సురక్షితంగా భూమికి తీసుకురావాలని ఈ ప్రాజెక్ట భావిస్తోంది.




అంతర్గత నైపుణ్యం, భారతీయ పరిశ్రమల అనుభవం, భారతీయ విద్యారంగం, పరిశోధనా సంస్థల మేధో సామర్థ్యాలతో పాటు అంతర్జాతీయ సంస్థల వద్ద అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిగణనలోకి తీసుకొని సరైన వ్యూహం ద్వారా ఈ మిషన్ సాధించవచ్చని ఇస్రో ఒక ప్రకటనలో తెలిపింది. ఇక గగన్ యాన్ మిషన్ల కోసం మానవ-రేటింగ్ కలిగిన ఎల్వీఎం 3 లాంచ్ వెహికల్ క్రయోజెనిక్ దశకు శక్తినిచ్చే సిఇ 20 క్రయోజెనిక్ ఇంజిన్ మానవ రేటింగ్లో ఇస్రో ఒక పెద్ద మైలురాయిని సాధించింది. ఫిబ్రవరి 13, 2024 న చివరి రౌండ్ గ్రౌండ్ క్వాలిఫికేషన్ పరీక్షలు పూర్తయ్యాయి. మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ లోని హై ఆల్టిట్యూడ్ టెస్ట్ ఫెసిలిటీలో విమాన పరిస్థితులను అనుకరించడానికి నిర్వహించిన వాక్యూమ్ ఇగ్నిషన్ పరీక్షల శ్రేణిలో ఇది ఏడో పరీక్ష అని ఇస్రో ఒక ప్రకటనలో తెలిపింది.

## 'ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే ఇందిరా గాంధీని అవమానించినట్టే'

కరీంనగర్: బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి బండి సంజయ్ కుమార్ మరో సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజాహిత యాత్రకు అడగడుగునా అడ్డంకులు సృష్టిస్తు అరాచకాలు సృష్టించేందుకు యత్నిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కు సవాల్ విసిరారు. "కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి తాను ఏం చేశానో ప్రజలకు వివరిస్తూ ఎన్నికల్లోకి వెళుతున్నానని, కేంద్రం ఎన్ని నిధులిచ్చిందో, మోదీ ఏం చేశారో చెబుతున్నానని వివరించారు. రాముడు అయోధ్యలో పుట్టారనడానికి ఆధారాలేమిటని కించపర్చే వారిని ప్రశ్నిస్తూ జనంలోకి వెళుతున్నానని, కాంగ్రెస్ వాళ్లకు దమ్ముంటే.. ఇదే విధానాలతో, నినాదాలతో ఎన్నికల్లోకి వెళ్లాలని సూచించారు. కరీంనగర్ లో తాను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని, కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతే.. మంత్రి పదవికి పొన్నం ప్రబాకర్ రాజీనామా చేసి శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకునేందుకు సిద్ధమా? అని సవాల్ విససిరారు. 6 గ్యారంటీలను అమలు చేయడం చేతగాక ప్రశాంతంగా ప్రజాహిత యాత్ర చేస్తుంటే కాంగ్రెస్ మూకలను పంపి విధ్వంసం సృష్టించాలనుకుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని పొన్నం ప్రభాకర్ ను హెచ్చరించారు. గతంలో రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పొన్నం ప్రభాకర్ ఆయనను తీవ్రంగా వ్యతిరేకించారని? ఇప్పుడు కూడా ఇలాంటి విధ్వంసాలకు పాల్పడుతూ అరాచకాలు సృష్టిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తేలా చూస్తున్నారని మండిపడ్డారు. రేవంతన్నా? పొన్నం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మలిదశ ప్రజాహిత్ర 2వ రోజు బొమ్మెనపల్లిలో ప్రారంభమై రాములపల్లెలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా హుస్నాబాద్ లో కాంగ్రెస్ మూకలు బిజెపి ఫ్లెక్సీలు చింపివేస్తూ, బండి సంజయ్ దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తున్న విషయాన్ని మీడియా ప్రతినిధులు ప్రస్తావించారు. ప్రజాహిత యాత్రను ప్రశాంతంగా కొనసాగిస్తున్నాం. మేం చేసిన అభివృద్ధి, మోదీ ప్రభుత్వం చేసిన పనులను, కేంద్రం ఈ నియోజకవర్గానికి వెచ్చించిన నిధులను వివరిస్తూ ప్రజాహిత యాత్రను కొనసాగిస్తున్నామని, కానీ ఇక్కడున్న మంత్రి ప్రతిసారి హల్ చల్ చేయాలని చూస్తున్నారని, ప్రతిదాంట్లో కలుగజేసుకుంటున్నారని మండిపడ్డారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తానని చెప్పారని,. ఇందిరాగాంధీ ఫోటో పెట్టుకుని మేనిఫెస్టో విడుదల చేశారని, ఇవాల్టికి 80 రోజులైందని, ఎందుకు అమలు చేయడం లేదు? అని ప్రశ్నించారు. 6 గ్యారెంటీలను, మేనిఫెస్టోలోని 423 హామీలను అమలు చేయకుంటే ఇందిరాగాంధీని అవమానించినట్లే ధ్వజమెత్తారు.

## హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటే : హరీశ్‌రావు



హైదరాబాద్ : హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారింది అని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. అధికారంలోకి రాగానే, ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామని, ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పిన కాంగ్రెస్, నేడు మాట తప్పిందని పేర్కొన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ పేరిట ఫీజు వసూలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందన్నారు. నో ఎల్‌ఆర్‌ఎస్ ? నో బీఆర్‌ఎస్ అంటూ గతంలో ప్రజలను రెచ్చగొట్టి ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్‌కు ఫీజులు వసూలు చేస్తామనడం కాంగ్రెస్ నేతల మోసపూరిత మాటలకు నిదర్శనమని చెప్పారు. కాంగ్రెస్ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్‌ఆర్‌ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలి. లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నా అని హరీశ్‌రావు తన ట్వీట్‌లో పేర్కొన్నారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్ కు అలవాటుగా మారింది. అధికారంలోకి రాగానే, ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామని, ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పిన కాంగ్రెస్, నేడు మాట తప్పింది. ఎల్ ఆర్ ఎస్ పేరిట ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైంది.

## క్రాస్ ఓటింగ్.. హిమాచల్‌లో ప్రమాదంలో కాంగ్రెస్!



ఢిల్లీ: ఉత్తర ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో జరుగుతున్న రాజ్యసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు భారీగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడుతున్నారు. యూపీలో బీజేపీ ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యేల క్రాస్ ఓటింగ్ వేస్తున్నట్లు తెలుస్తోంది. సమాజ్‌వాదీ పార్టీ మూడవ అభ్యర్థి ఓడిపోయే అవకాశం ఉంది. ఇక.. హిమాచల్ ప్రదేశ్‌లోనూ 9 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడట్టు తెలుస్తోంది. ఇంత భారీ స్థాయిలో క్రాస్ ఓటింగ్ జరిగితే.. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాదంలో పడనుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. 68 మంది ఎమ్మెల్యేలున్న హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలో కాంగ్రెస్‌కు 40 ఎమ్మెల్యేల మద్దతు ఉండగా.. బీజేపీకి కేవలం 25 ఎమ్మెల్యేల మద్దతు మాత్రమే ఉంది. కాంగ్రెస్ కూడా ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించారు. బీజేపీకి తగిన సంఖ్యాబలం లేకపోయినా.. రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టడం గమనార్హం.

## వారంలోగా హమాస్ - ఇజ్రాయెల్ మధ్య సంధి.. జో బైడెన్ కీలక ప్రకటన..

గాజాలో హమాస్-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కీలక ప్రకటన చేశారు. దీంతో పెను ముప్పు పొంచి ఉన్న సమయంలో యుద్ధంలో చితికిపోతున్న గాజా జనానికి ప్రాణం లేచి వచ్చినట్టు అనిపిస్తోంది. వచ్చే సోమవారం అంటే మార్చి 4వ తేదీ నాటికి రెండు దేశాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ వచ్చే అవకాశం ఉందన్నది బైడెన్ మాట. ఖతర్‌లో ఇజ్రాయెల్-గాజా దేశాల ప్రతినిధుల మధ్య జరుగుతున్న చర్చలు కొలిక్కి వచ్చాయని? వీలైనంత త్వరలో ఒక ఒప్పందానికి వచ్చే అవకాశం ఉందని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు తనతో చెప్పారన్నది ఆయన మాటల సారాంశం. అయితే ఇప్పటి వరకు ఒక నిర్దిష్ట ఒప్పందం ఏదీ కుదరలేదని బైడెన్ చెప్పారు. అయితే ముస్లింల పవిత్ర మాసం రంజాన్‌కు ముందే తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరే అవకాశమున్నట్లు తెలుస్తోంది. బైడెన్ చెప్పినట్లు గాజాలో కాల్పుల విరమణ జరిగితే.. ఆకలి చావుల అంచున ఉన్న గాజా ప్రజల నోట్లో అమృతం పోసినట్టే. గాయాలకు మందుల్లేక? ఆస్పత్రుల్లో అల్లాడుతున్న క్షతగాత్రుల ప్రాణాలకు ఆశలు కల్పించినట్టే. కాల్పుల విరమణ తాత్కాలికం కావచ్చు? షరతులు వర్తిస్తాయ్ అని ఎలుగెత్తి చెప్పొచ్చు. అయినా సరే? సరిహద్దుల ఆవలే ఆగిపోయిన సాయం? ఈవలకు రావాలని? కేవలం గాజా ప్రజలు మాత్రమే కాదు.. వారి కష్టాలు.. కన్నీళ్లను? ఆకలి బాధల్ని అక్కడే ఉండి కళ్లారా చూస్తున్న ఏమీ చేయలేకపోతున్న అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు కోరుకుంటున్నాయి. ఈ మానవీయ సంక్షోభానికి ఇకనైనా ముగింపు పలకాలన్నదే వారి ఆశ. అందుకే ఇప్పుడు బైడెన్ మాటలకు అంతటి విలువ. సరిగ్గా 2023 అక్టోబర్ 7న ఈ దారుణ మారణ కాండకు బీజం పడింది. దక్షిణ ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేసి 1200 మందిని చంపేయడం? 253 మందిని బంధీలుగా పట్టుకెళ్లడం ఇజ్రాయెల్ ఆగ్రహానికి అసలు కారణం. ఇప్పటి వరకు ఈ పరస్పర దాడుల్లో సుమారు 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారు.



## 8 మందిపై వేటు వేసేశారు...

విజయవాడ, ఫిబ్రవరి 27 8 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ ఏపీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల అనర్హత పిటిషన్ లపై స్పీకర్ తమ్మినేని విచారణను ముగించారు. వైసీపి, టీడిపి పార్టీలు ఇచ్చిన రెబల్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ లపై న్యాయ నిపుణుల సలహా తీసుకున్న తరవాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి స్పీకర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్సీపీ పిటిషన్‌తో ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవిపై అనర్హత వేటు వేశారు. టీడీపీ పిటిషన్‌తో మద్దాలగిరి, కరణం బలరాం, వల్లభనేని వంశీ, వాసుపల్లి గణేష్‌పై వేటు వేశారుఇటీవల రాజ్యసభ ఎన్నికల సమయంలో అధికార వైసీపీ వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. ఎమ్మెల్సీ ఎన్నికలు సందర్భంగా పార్టీ లైన్ దాటి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు ఓట్లేశారంటూ నలుగురు వైసీపీ ఎమ్మెల్యేలను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఆ తరువాత వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అనూహ్యంగా రాజ్యసభ ఎన్నికల టైంలో వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలపై చర్యలకు అధికార పార్టీ సిద్ధమైంది. ఈ మేరకు స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో స్పీకర్ కార్యాలయం వారికి నోటీసులు పంపించింది. అదే సమయంలో టీడీపీ నుంచి గెలిచి వైసీపీతో సన్నిహితంగా మెలిగిన వారికి స్పీకర్ కార్యాలయం నుంచి నోటీసులు అందాయి. రెండు పార్టీలకు చెందిన రెబల్ ఎమ్మెల్యేలకు స్పీకర్ కార్యాలయంలో విచారించారు. న్యాయ నిపుణుల సలహా తీసుకున్న తరువాత స్పీకర్ తమ్మినేని 8 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేశారు.ఏపీలో అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికలకుగానూ అధికార పార్టీ ఇదివరకే 7 విడతలుగా ఇంఛార్జ్ ల జాబితాలను విడుదల చేసింది. మరోవైపు ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీతో పొత్తుతో ఎన్నికలకు వెళ్తోంది. టీడీపీ, జనసేన తొలి విడత అభ్యర్థులుగా 99 మంది పేర్లను శనివారం ప్రకటించారు. ఇందులో 94 మంది టీడీపీ అభ్యర్థులు కాగా, జనసేన నుంచి 5 మంది ఉన్నారు.

## బీజేపీ ఒంటరి పోరేనా

విజయవాడ, ఫిబ్రవరి 27 వీ విషయంలో బిజెపి క్లారిటీ ఇవ్వడం లేదు. తెలుగుదేశం, జనసేనలు మాత్రం అభ్యర్థులను ప్రకటిస్తున్నాయి. ఏకంగా 99 మంది అభ్యర్థులను ప్రకటించారు. మరో 19 స్థానాల్లో జనసేన అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఈ లెక్కన మిగిలి ఉన్నది 57 స్థానాలు. వీటిలో బిజెపికి ఇచ్చే సీట్లు ఎన్ని? అన్నదే ఇప్పుడు ప్రశ్న. కానీ బిజెపి అగ్ర నేతల నుంచి ఎటువంటి స్పందన లేదు. టిడిపి,జనసేనలు మాత్రం కేంద్ర పెద్దలను ఆశ్రయించి తాము సీట్లు ప్రకటించినట్లు చెబుతున్నారు. బిజెపి తప్పకుండా కూటవిలోకి వస్తుందని చెప్పుకొస్తున్నారు .మరోవైపు బిజెపి రాష్ట్ర నాయకులు సైతం చాలామంది టిక్కెట్లపై ఆశలు పెట్టుకున్నారు. పొత్తులో భాగంగా తమకు అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు. అయితే బిజెపిలో కొత్తగా చేరికలు చూసి ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది పారిశ్రామికవేత్తలు, ఆర్థిక స్థితిమంతులు బిజెపిలో చేరుతున్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి వారిని పార్టీలో చేర్చుకుంటున్నారు. ఇలా చేరిన వారు అభ్యర్థిత్వాలను ఆశిస్తుండడం విశేషం.అయితే ఈ పరిణామాలను గమనిస్తున్న బిజెపి నేతలకు మాత్రం మింగుడు పడడం లేదు.పొత్తులో భాగంగా విజయవాడ పశ్చిమ స్థానం జనసేనకు కేటాయిస్తారని ప్రచారం జరిగింది. అక్కడ జనసేన నాయకుడు పోతిన మహేష్ ఉన్నారు.

# ఆ సీట్లలో తేలని అభ్యర్థులు

ఏలూరు, ఫిబ్రవరి 27 టిడిపి, జనసేన సంయుక్తంగా అభ్యర్థులను ప్రకటించాయి. పొత్తులో భాగంగా జనసేనకు 24 అసెంబ్లీ స్థానాలు, మూడు పార్లమెంట్ స్థానాలు ఇచ్చేందుకు టిడిపి అంగీకరించింది. కానీ తెలుగుదేశం పార్టీ మాత్రం 94 నియోజకవర్గాల్లో తన అభ్యర్థులను ప్రకటించింది. జనసేన మాత్రం ఐదింటికి పరిమితమైంది. టిడిపి,జనసేన మధ్య సీట్ల సర్దుబాటు ప్రక్రియ పూర్తయిందని ఇరు పార్టీల నేతలు ప్రకటించారు. అటువంటప్పుడు జనసేనకు కేటాయించిన 24 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయవచ్చు కదా? అని జన సైనికులు ప్రశ్నిస్తున్నారు. ఇచ్చిన సీట్లు తక్కువ కదా.. ఈ ట్విస్టులు ఏమిటని వాపోతున్నారు.అభ్యర్థుల ప్రకటన తర్వాత తెలుగుదేశం పార్టీతో పాటు జనసేనలో కూడా అసంతృప్తి నెలకొంది. చాలామంది బాహటంగానే తమ అసంతృప్తిని వెళ్ళగక్కుతున్నారు. ముఖ్యంగా జనసేనలో విపరీతమైన అసంతృప్తి ఉంది. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడిన నేతలు ఉన్నారు. పొత్తులో భాగంగా సీట్లు దక్కితే.. ఎమ్మెల్యేలుగా గెలుపొందుతామని ఆశలు పెట్టుకున్నారు. దాదాపు 40 వరకు అసెంబ్లీ స్థానాలు లభిస్తాయని ఆశించారు. కానీ వారి ఆశలు నీరుగారిపోయాయి. కేవలం 24 అసెంబ్లీ సీట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. ఇది జనసైనికులకు మింగుడు పడని అంశం. కానీ పవన్ మాత్రం బలం తగ్గట్టే సీట్లు కోరామని.. సర్దుబాటు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్ని సీట్లు అడిగామన్నది కాదని.. వచ్చిన సీట్లలో మెజారిటీ స్థానాలు దక్కించుకోవడమే తమ ముందున్న ధ్యేయమని జనసైనికులకు నూరి పోస్తున్నారు.మరోవైపు 24 సీట్లకు గాను ఐదుగురు అభ్యర్థులను మాత్రమే ప్రకటించడంపై జనసైనికులు అనుమానపు చూపులు చూస్తున్నారు. ఈ ఐదు సీట్లలో కొణతాల రామకృష్ణకు సీటు కేటాయించడంపై అభ్యంతరాలు ఉన్నాయి. కొద్ది రోజుల కిందటే ఆయన జనసేనలో చేరారు. ఇలా చేరిన కొద్ది రోజులకే టికెట్ దక్కించుకున్నారు. వాస్తవానికి కొణతాల రామకృష్ణ టీడీపీలో చేరతారని ప్రచారం జరిగింది. కానీ ఆయన అనూహ్యంగా జనసేనలో చేరారు. టికెట్ సొంతం చేసుకున్నారు. ఈ మొత్తం ఎపిసోడ్లో చంద్రబాబ చక్రం తిప్పినట్లు ప్రచారం జరుగుతోంది. టిడిపిలోకి రావాల్సిన వారిని జనసేనలో చేర్చి టిక్కెట్ ఇప్పిస్తున్నారని టాక్ నడుస్తోంది. అందుకే ఆ 19 స్థానాలను రిజర్వులో పెట్టారని.. టిడిపిలో టిక్కెట్ దక్కని వారికి జనసేనలోకి పంపించి ఆ టిక్కెట్లు కేటాయిస్తారని పొలిటికల్ సర్కిల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. జనసేన ఆవిర్భావం నుంచి ఎంతోమంది నాయకులు పనిచేశారు. అటువంటి నాయకులు టికెట్లు ఆశిస్తున్నారు. కానీ తాజా పరిస్థితులను చూసి వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సీట్లు దక్కని జనసేన నేతలు అసంతృప్తితో రగిలిపోతున్నారు. మిగతా 19 స్థానాల విషయంలో సొంత పార్టీ శ్రేణులకు న్యాయం జరగకుంటే.. జనసేనలో పొత్తును వ్యతిరేకించేవారు అధికమవుతారని విశ్లేషణలు ప్రారంభమయ్యాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# హ్యాట్రిక్... డబుల్ హ్యాట్రిక్ పై కన్ను

విశాఖపట్టణం, ఫిబ్రవరి 27 విశాఖపట్నం జిల్లాలో 15 నియోజక వర్గాలు ఉంటే ఆరు స్థానాలకు టీడీపీ , జనసేన కూటమి అభ్యర్థులను ప్రకటించింది. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చంద్రబాబు అభ్యర్థులను ప్రకటించారు. 94 స్థానాలకు ఒకే సారి అభ్యర్థులను ఖరారు చేసి...ప్రత్యర్థులకు షాకిచ్చారు. సీటు దక్కని నేతలను పిలిపించి మాట్లాడుతున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయం చేస్తామని హామీ ఇస్తున్నారు. విశాఖ తూర్పు నియోజకవర్గంలో వైసీపీ, టీడీపీ అభ్యర్థిత్వాలు ఊహించినట్టుగానే ఖరారయ్యాయి. హ్యాట్రిక్ ఎమ్మెల్యే వెలగపూడి రామక్రిష్ణబాబు కి మరోసారి తెలుగుదేశం పార్టీ టికెట్ కేటాయించింది. సిట్టింగ్ ల జాబితాలో ఆయన పేరును ప్రక టించింది హైకమాండ్. 2009లో తొలిసారి గెలిచిన వెలగపూడి....ఇప్పుడు నాలుగోసారి బరిలోకి దిగుతున్నారు. ఆయనను ఎలాగైనా ఓడించాలన్న లక్ష్యంతో విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యన్నారాయణను పోటీ పెట్టింది. దీంతో తూర్పులో రాజకీయం ఇప్పటికే వేడెక్కింది. ఇక్కడ జనసేన ఓటింగ్ బలమైనది...గెలుపు ఓటములను నిర్ధేశించే స్థాయికి పెరిగింది. 2009, 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ తరపున వెలగపూడి రామక్రిష్ణబాబు గెలుపొందారు.విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో సీనియర్ ఎమ్మెల్యే గణబాబు అభ్యర్థిత్వంను ఫస్ట్ లిస్టులోనే ప్రకటించింది టీడీపీ. గణబాబును ఓడించాలనే గట్టిపట్టుదలతో ఇక్కడ బిగ్ షాట్ ఆడారి ఆనంద్ కుమార్‌ను పోటీ పెట్టింది వైసీపీ. నగరం నడిబొడ్డున విస్తరించిన ఈ సెగ్మెంట్లో పారిశ్రామిక ప్రాంతం ఎక్కువ. ఇక్కడ ఉత్తరాది, వలస ఓటర్లు డిసైడింగ్ ఫ్యాక్టర్. గవర సామాజిక వర్గానికి ఈ సీటును ప్రధాన పార్టీలు కేటాయించడం ఆనవాయితీగా వస్తోంది. పశ్చిమలో కాపు ఓటింగ్ కీలకమైనది. జనసేన-టీడీపీ కలయిక కొంత మేర సిట్టింగ్ ఎమ్మెల్యేకు కలిసి వచ్చే చాన్స్ ఉంది. విశాఖ డైరీ చైర్మన్ ఆనంద్ ఇక్కడ బలమైన అభ్యర్థి. టీడీపీ, వైసీపీ ఒకేసామాజిక వర్గానికి చాన్స్ ఇచ్చింది. ఆడారి ఫ్యామిలీ మొదటి నుంచి టీడీపీలోనే వుంది. గత ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా పోటీ చేసిన ఆనంద్ ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత వైసీపీలో చేరడంతో ఆయనకు స్టేట్ ఓఓఇ కార్పోరేషన్ చైర్మన్ పదవి ఇచ్చింది. సిట్టింగ్ ఎమ్మెల్యే గణబాబు..2014, 2019 ఎన్నికల్లో రెండు సార్లు గెలుపొందారు.ూఅ రిజర్వ్డ్ నియోజకవర్గమైన పాయకరావుపేటలో హోరాహోరీ పోరు ఖాయంగా కనిపిస్తోంది. తెలుగుదేశం పార్టీ తరపున మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితకు సీటు ఖరారు చేసింది. సీనియర్ శాసనసభ్యుడు, రాజాం సిట్టింగ్ ఎమ్మెల్యే కంబాల జోగులును ఇక్కడి నుంచి బరిలోకి దించుతోంది వైసీపీ. రాజాంకు చెందిన జోగులును పంపడం ద్వారా పాయకరావుపేటలో కొత్త ముఖం తెచ్చిపెట్టింది. సౌమ్యుడిగా పేరున్న జోగులు మీద ఫైర్ బ్రాండ్ వంగలపూడి అనిత బరిలోకి దించింది. అనిత 2014-19 మధ్య పాయకరావుపేట ఎమ్మెల్యేగా పనిచేశారు. 2019 లో కొవ్వూరు నుంచి పోటీ చేసి హోంమంత్రి తానేటి వనిత చేతిలో ఓటమి పాలయ్యారు. ఇప్పుడు తొలి జాబితాలోనే అనిత టిక్కెట్ ఖరారు చేసింది టీడీపీ అధిష్టానం. ఇక్కడ జనసేన ఓట్ బ్యాంక్ చాలా కీలకమైంది.

# చీపురుపల్లి నుంచి గంటా...



విజయనగరం, ఫిబ్రవరి 26,టీడీపీ, జనసేన అభ్యర్థుల తొలి జాబితా బావుందని, ఎక్కడో ఓ చోట చిన్న అలజడి సహజమేనన్నారు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు. కొందరు గంటా టీడీపీని వీడి వైసీపీలో చేరతారని ప్రచారం చేశారు. తొలి జాబితా విడుదల కావడంతో గంటా శ్రీనివాసరావు, చంద్రబాబుతో కీలక భేటీ అయ్యారు. అభ్యర్థుల ఎంపిక సరిగ్గానే ఉందని, చీపురుపల్లి నుంచి తన పోటీపై చర్చించినట్లు గంటా తెలిపారు. చీపురుపల్లి నుంచి మంత్రి బొత్స సత్యనారాయణ బరిలో ఉంటారు. అయితే ఇదే నియోజకవర్గం నుంచి గంటాను బరిలో నిలపాలని టీడీపీ అధినేత చంద్రబాబు భావిస్తున్నారు. భేటీలోనూ చంద్రబాబు ఇదే విషయం చెప్పారని, ఎక్కడి నుంచి పోటీ చేసినా గెలుస్తావని చంద్రబాబు తనతో అన్నట్లు గంటా చెప్పుకొచ్చారు. అయితే తాను విశాఖ జిల్లాలోనే ఉండాలనుకుంటున్నట్లు.. భీమిలి నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్లు చంద్రబాబుకు గంటా వివరించారు. మరో రెండు రోజుల్లో ఈ విషయంపై చర్చించేందుకు చంద్రబాబు పిలుస్తానని గంటా శ్రీనివాసరావుకు చెప్పారు. చీపురుపల్లి నుంచే పోటీ చేయాలని బలవంతం చేస్తున్నారన్న వ్యాఖ్యలపై సైతం గంటా స్పందించారు. అలాంటిదేమీ లేదని, చీపురుపల్లి నుంచి పోటీ చేసినా, భీమిలి నుంచి బరిలోకి దిగినా తన గెలుపు ఖాయమని చంద్రబాబు ధీమాగా ఉన్నారని తెలిపారు. కానీ చీపురుపల్లి నుంచే బరిలోకి దిగుతావా అని చంద్రబాబు అడిగినట్లు స్పష్టం చేశారు. లేదు కచ్చితంగా భీమిలి అనేదే ఉద్దేశమైతే మరోసారి పిలిచినప్పుడు అభిప్రాయం చెప్పాలన్నారు. చీపురుపల్లి నుంచే గంటా పోటీ చేస్తారని ప్రచారం జరగడంతో మంచి రెస్పాన్స్ వచ్చిందని చంద్రబాబు చెప్పినట్లు తెలిపారు.చంద్రబాబును కొన్ని రోజుల తరువాత ఇప్పుడే కలిశానని, కానీ మేం భేటీ అవ్వకుముందే తిట్టుకున్నామంటూ వదంతులు ప్రచారం జరిగిందన్నారు. ఈ దుష్ప్రచారంపై లీగల్ నోటీసులు పంపాలని ఆలోచిస్తున్నట్లు చెప్పారు. తొలి జాబితాలో సీనియర్ల పేరు లేకపోవడంతో పార్టీలో ఏ అసంతృప్తి లేదని స్పష్టం చేశారు. ఉదాహరణకు తన పేరు తొలి జాబితాలో లేకున్నా.. పలానా చోట నువ్వు పోటీ చేస్తేనే బాగుంటుందని పార్టీ భావించినట్లు పేర్కొన్నారు. ప్రాముఖ్యత ఇవ్వడంతోనే కొన్ని ముఖ్యమైన చోట పోటీ చేస్తారా అని చంద్రబాబు అడిగారని.. పొత్తు ధర్మం ఉందన్న విషయాన్ని గుర్తుచేశారు.ఒకటేసారి 175 సీట్లకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం లేదని, వైసీపీ 7 జాబితాలు విడుదల చేసినా కేవలం 70 మంది పేర్లను ప్రకటించిందన్నారు గంటా. అందులోనూ అవి అభ్యర్థుల జాబితాలు కాదని, ఎవరినైనా తొలగించే ఛాన్స్ ఉందని వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి చెప్పినట్లు ఆయన గుర్తుచేశారు. పార్టీ అన్ని కోణాల్లో ఆలోచించి, తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. జనసేన, టీడీపీకి ఎన్ని సీట్లు అనేది రెండు పార్టీల అధినేతలు చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా, తలకిందుల తపస్సు చేసినా, కాపులు మాత్రమే కాదు అన్ని వర్గాల వారు వైసీపీకి దూరమయ్యారని కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీ మునిగిపోయే నావ అని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఘన విజయం సాధిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

## జగన్ పథకాలు బాగున్నాయ్... కానీ



అనంతపురం, ఫిబ్రవరి 27 రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులు, టీడీపీ, జనసేన కూటమి మధ్య సీట్ల పంపకాలు, జగన్ పాలనపై మాజీ మంత్రి జెసి దివాకర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఇంకా ఎలక్షన్ వేడి లేదని, తనకు రాజకీయాలు వాసన పోలేదని స్పష్టం చేశారు. ఎలాగైనా జగన్ ను గద్దె దించాలని చంద్రబాబు , పవన్ కళ్యాణ్ వాళ్ళ ఆత్మీయులకు కూడా టిక్కెట్ ఇవ్వలేదన్న జెసి.. రాక్షస పాలన అంతమొందించాల్సిన అవసరం ఉందన్నారు. టికెట్ రాని వాళ్ళకు అసంతృప్తి సహజమన్నారు. మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడని, అయినా మార్పు తప్పలేదన్నారు. పార్టీ అంతా ఏకతాటిపై ఉందని, నిన్న ఉన్నంత అసంతృప్తి, టెన్షన్ ప్రస్తుతం లేదని, రేపు అస్సలు ఉండదన్నారు. ఈ అసంతృప్తి అంతా పాలు పొంగు లాంటిదని, దీని గురించి ఆందోళన అవసరం లేదన్నారు. తనలాంటి వాళ్ళకు కూడా జగన్ అధికారంలోకి రాకూడదని ఉందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఓట్లు చీలకుండా ఉండేందుకు బీజేపీతో పొత్తు కావాలనే కోరుకుంటున్నామని, ఎంత వరకు సఫలం అవుతుందో చూడాలన్నారు. చంద్రబాబు కచ్చితంగా సీఎం అవుతారని, అన్ని పార్టీల ధ్యేయం జగన్ అధికారంలోకి రాకూడదనే అని స్పష్టం చేశారు జెసి దివాకర్ రెడ్డి. తన కుమారుడు పవన్ రెడ్డికి టికెట్ ఎక్కడ అన్న విషయం తెలియదని, పార్టీ అధిష్టానాన్ని సోదరుడు, కుమారుడు పవన్ రెడ్డి కలిసిన మాట వాస్తవమేనన్నారు. కుటుంబానికి ఒక టిక్కెట్ అని చంద్రబాబు తమకు చెప్పలేదని వెల్లడించిన జెసి.. షర్మిల తెలంగాణకు కాకుండా ముందే ఏపీకి వేస్తే లాభం ఉండేదన్నారు. షర్మిల ట్రైన్ మిస్ అయిందని అభిప్రాయపడ్డారు. సీఎం జగన్ సభలకు వస్తున్న జనాలపైనా జెసి ఆసక్తికర కామెంట్స్ చేశారు. మందు, ముక్క కోసమే జగన్ సభలకు జనాలు వస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీడీపీ 12 స్థానాలు గెలుస్తోందని స్పష్టం చేశారు. జగన్ సభలకు జనం ఇతర జిల్లాల నుంచి వస్తున్నారని, ఇందుకు భారీ ఏర్పాట్లను స్థానిక నాయకులు చేసేలా ఆదేశాలు ఉన్నాయన్నారు. జగన్ పథకాలు కొన్ని బాగున్నాయని, తమ ప్రభుత్వం వచ్చాక ఆ పథకాలు కొనసాగిస్తూ.. కొత్త పథకాలు పెట్టబోతున్నామని జెసి స్పష్టం చేశారు. జగన్ పాలన మాత్రం బాలేదని, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని జెసి దివాకర్ రెడ్డి స్పష్టం చేశారు. హిట్లర్ లాంటి నియంత పాలన రాష్ట్రంలో ఉందని, అందుకే షర్మిల బయటకు వచ్చారని వెల్లడించారు. టీడీపీ అభ్యర్థుల లిస్ట్ చూసిన తరువాత అధికారపక్షం కూడా బయపడుతోందన్నారు. జగన్ కు బలం ఉందని, అయితే ప్రజలు మాత్రం ఆలోచనాపరులు అని జెసి పేర్కొన్నారు.

## మేదరమెట్లలో 200 ఎకరాల్లో ముగింపు సభ

ఒంగోలు, ఫిబ్రవరి 27భీమిలిలో వైసీపీ సమరశంఖం పూరించింది. దెందులూరులో యుద్ధానికి సిద్ధమని ప్రకటించింది. రాప్తాడు సభతో వైసీపీ దమ్మేంటో చూపించింది. ఇక చరిత్రలో నిలిచిపోయేలా అద్దంకిలో సిద్ధం ముగింపు సభకు ప్లాన్ చేస్తోంది వైసీపీ. ఇంతకీ ఈ సభకు ఏయే పార్లమెంట్ సెగ్మెంట్ల నుంచి కార్యకర్తలు రాబోతున్నారు? ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయి? ఎన్ని లక్షల మంది హాజరుకానున్నారు.. అనేది ఆసక్తికరంగా మారింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. ఈ నేపథ్యంలోనే అభ్యర్థుల మార్పులు చేర్పులపై కొంతవరకు కసరత్తు పూర్తి చేసిన సీఎం జగన్.. ఆ తర్వాత ఎన్నికల ప్రచారంలోకి దిగారు. సిద్ధం పేరుతో ఏపీలోని నాలుగు ప్రాంతాలను కవర్ చేసేలా భారీ బహిరంగ సభలకు వైసీపీ ప్లాన్ చేసింది వైసీపీ. అందులో భాగంగా భీమిలిలో నిర్వహించిన తొలి సిద్ధం సభ గ్రాండ్ సక్సెస్ అయింది. రెండో సిద్ధం సభతో దెందులూరు దద్దరిల్లింది. ఇక రాప్తాడుకు జనసంద్రమే తరలివచ్చింది. అంతకు మించి అనేలా.. రాయలసీమ చరిత్రలోనే ఏ సభకూ రానంత మంది జనం ఈ సభకు హాజరయ్యేనట్టు పార్టీ స్పష్టం చేసింది. వైసీపీ లెక్కల ప్రకారం ఈ సభకు 10లక్షల మంది హాజరయ్యారు.ఇక నాలుగో సభ.. ముగింపు సభను అద్దంకి నియోజకవర్గంలోని మేదరమెట్లలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాప్తాడు సభను 110 ఎకరాల్లో ఏర్పాటు చేస్తే.. ముగింపు సభ కోసం 200 ఎకరాలు సేకరించారు. వచ్చే నెల 3న జరిగే ఈ సభకు నెల్లూరు, తిరుపతి, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని 54 నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున జనాల్ని తరలించేందుకు పార్టీ శ్రేణులు కసరత్తు చేస్తున్నాయి. ఈ ఏర్పాట్లపై సన్నాహక సమావేశాన్ని ఎంపీ విజయసాయిరెడ్డి నిర్వహించారు. 15 లక్షల మంది ఈ సభకు వస్తారని ఆయన అంచనా వేశారు.మొత్తంగా ఇది చివరి సిద్ధం సభ కావడంతో మిగతా మూడు సభలను తలదన్నేలా విజయవంతం చేయడానికి పార్టీ సన్నాహాలు చేస్తోంది. ఇక ఈ సిద్ధం సభలు పూర్తైన తర్వాత.. పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహించి.. తదుపరి ఎన్నికల ప్రచారం, సభలకు సంబంధించిన విధివిధానాలు ఖరారు చేయనున్నారు సీఎం జగన్.

# చేనేతలకు రాయితీ...

గుంటూరు, ఫిబ్రవరి 27 నేతన్నలకు ఏపీ సర్కార్ శుభవార్త చెప్పంది. పవర్ లూమ్ చేనేత కార్మికులకు ఊరట కలిగించే నిర్ణయం తీసుకుంది. పవర్ లూమ్ లకు విద్యుత్ సబ్సిడీ అందిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పవర్ లూమ్ విద్యుత్ వినియోగంలో ప్రతి యూనిట్ కు 94 పైసలు ప్రభుత్వం రాయితీగా అందిస్తున్నట్లు తెలిపింది. పవర్ డ్యూటీని రూ.1 నుంచి 6 పైసలకు తగ్గించినట్లు ప్రకటించింది. విద్యుత్ రాయితీతో పవర్ లూమ్స్ వినియోగించే నేతన్నలకు మేలు జరుగుతుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంపై చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఏపీలోని చాలా జిల్లాల్లో నేతన్నలు పవర్ లూమ్స్ ద్వారా వస్త్రాలు తయారు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అయితే ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు కేవలం హ్యాండ్ లూమ్స్ చేనేత కార్మికులకు మాత్రమే మాత్రమే అందుతున్నాయని, పవర్ లూమ్ వారికి సాయం అందడంలేదని వాపోతున్నారు. విద్యుత్ రాయితీలు కల్పించి తమను సైతం ఆదుకోవాలని గత కొంతకాలంగా నేతన్నలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నేతన్నల అభ్యర్థనలపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం పవర్ లూమ్ చేనేత కార్మికులకు విద్యుత్ సబ్సిడీలు ప్రకటించింది.చేనేత కార్మికులుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ నేతన్న నేస్తం( కింద ఏటా రూ. 24,000 ఆర్థిక సాయం అందిస్తుంది. చేనేత కార్మికులు పవర్ లూమ్ ఉత్పత్తులతో పోటీ పడటానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుంది. ప్రతి చేనేత కార్మికుడు సొంత మగ్గం కలిగి ఉండి, దానిపై పని చేస్తూ జీవనోపాధి పొందుతున్న వారు నేతన్న నేస్తం పథకానికి అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. కుటుంబంలో ఎన్ని చేనేత మగ్గాలు ఉన్నా ఒక్క కార్మికుడికి మాత్రమే ఆర్థిక సహాయం అందుతుంది. ఈ పథకానికి దారిద్ర రేఖకు దిగువన ఉన్నవారు మాత్రమే అర్హులు. చేనేత అనుబంధ వృత్తులలో పనిచేయు కార్మికులు ఈ పథకానికి అనర్హులు. అంటే నూలు వడికే వారు, పడుగు తయారు చేసేవారు, అద్దకం పని వారు, అచ్చులు అతికే వారు అనర్హులు.అర్హులైన చేనేత కార్మికులకు ప్రతి ఏటా ప్రభుత్వం రూ.24 వేల వారి ఖాతాల్లో జమచేస్తుంది. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, కుల ధ్రువీకరణ పత్రం, బియ్యం కార్డు లేదా రేషన్ కార్డు జిరాక్స్ పత్రాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో అందించి ఈ పథకం కోసం నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అర్హులైన వారికి సచివాలయ ఉద్యోగులు ఒక నెంబర్ ఇస్తారు. దరఖాస్తు చేసిన లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రకటించిన ముందస్తు షెడ్యూల్ ప్రకారం సంవత్సరానికి రూ.24,000 వేలు వై.యస్.ఆర్ నేతన్న నేస్తం పథకం ఖాతాల్లో జమ చేస్తుంది.రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, స్టేట్ హ్యాండ్లూమ్ అసోసియేషన్ జారీ చేసిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్. వీటిని సచివాలయాల్లో సమర్పించి రిజిస్టర్ చేసుకోవాలి.

## శానిటేషన్ పనుల పరిశీలన



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 27-పట్టణంలో 39-33-8-సచివాలయ పరిధిలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పర్యటించి శానిటేషన్ కు సంబంధించిన పనులను పరిశీలించారు. పారిశుధ్య పనుల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. 23 వార్డు ఏకలవ్య నగర్ లో పైప్ లీకేజీని పరిశీలించారు. కలుషిత నీరు తాగి మోషన్స్ తో ఇద్దరు ఉదయానంద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి కుటుంబ సభ్యులను సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు . కమిషనర్ వెంట మున్సిపల్ డీఈ శ్రీనివాసులు రెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. వార్డు వైసిపి ఇన్ చార్జ్ పార్థుడుతో పాటు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## 29 వతేదిన కౌన్సిల్ సదారణ సమావేశం

### నిరంజన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 27:- మున్సిపల్ కౌన్సిల్ సదారణ సమావేశం ఈ నెల 29 వతేదిన జరగనున్న నేపథ్యంలో ప్రదాన ఎజెండా సిద్ధమయిందని కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. కమిషనర్ మంగళవారం మున్సిపల్ కార్యాలయం యందు మాట్లాడుతూ నంద్యాల అభివృద్ధికి తగు విధంగా అజెండాను పొందుపరచడం జరిగిందన్నారు. సమావేశానికి కౌన్సిలర్లు అధికారులంతా హాజరు కావాలని కోరారు . అజెండా పత్రాలను ప్రజాప్రతినిధులకు కౌన్సిలర్లకు పంపించామని తెలిపారు .

## నిరుపేద వృద్ధురాలికి నిత్యావసరసరుకులు....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఫిబ్రవరి 27 ఉన్నవారిని అందరిని పోగొట్టుకొనినా అనేవారు ఎవరు లేని అనాధల్లా మిగిలిన ఈ వృద్ధురాలు పేరు సుంకమ్మ, ఆరేళ్ళ తన మనవరాలితో డోన్ రైల్వే గేట్ల పక్కన ఒక చిన్న గుడిసెలో అత్యంత దయనీయ స్థితిలో జీవిస్తూ తినడానికి కుడా లేని కడు దయనీయ పరిస్థితుల్లో వున్న వీరికి స్ఫూర్తి సేవా సమితి అండగా నిలిచింది. మంగళవారం నాడు ఆ కుటుంబానికి స్ఫూర్తి శ్రేయోభిలాషులు, దాతల సహకారంతో ఒక బస్తా బియ్యం, రెండు నెలల కిరాణం సరుకులు, కొత్త బట్టలు, కూరగాయలు, పళ్లు అందించారు. ఈ సందర్భంగా వృద్ధురాలు సుంకమ్మ సాయం చేసిన ప్రతి ఒక్క దాతకు తన కన్నీళ్లతో కృతజ్ఞతలు తెలిపింది. ముమ్ముందు వృద్ధురాలికి పాపకు ఎలాంటి సాయం కావాలన్న స్ఫూర్తి సేవా సమితి ముందుకు వస్తుందని, అవ్వ కుటుంబానికి అడిగిన వెంటనే సహకారం అందించిన ప్రతి ఒక్క దాతకు సంస్థ అధ్యక్షుడు సీసంగుంతల మధు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ఉప్పర్లపల్లి భాస్కర్, మారెళ్ల వాసు, రాజు, యోగ తదితరులు పాల్గొన్నారు.

## షూటింగ్ బాల్ భారత జట్టు మేనేజర్ గా పరుశ రాముడు

కర్నూల్ , (స్పోర్ట్స్ న్యూస్) మార్చి నెల మార్చి 2 , 3 వ తేదీలలో మన దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని జవహర్లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో నిర్వహించబోయే వరల్డ్ కప్ షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొని భారత మహిళల జట్టు మేనేజర్ గా కర్నూలు జిల్లా వాసి పరుశ రాముడు ఎంపికైనట్లు తెలిపారు. దానికి సంబంధించిన ఉత్తర్వులు షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ రవీంద్ర సింగ్ తోమర్ జారీ చేశారు. ప్రస్తుతం పరుశ రాముడు ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గా కొనసాగుతున్నట్టు తెలిపారు.

# పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

### అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 27- మార్చి 3న ఆదివారం జరిగే పల్స్ - పోలియో కార్యాక్రమాన్ని విజయవంతం చేయాల ని అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టౌన్ హాల్ నందు సచివాలయ హెల్త్ సెక్రటరీలు ఆరోగ్య సిబ్బంది, ఆశాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో 31.350 పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. వారికి తగిన విధంగా 112 భూతులు. 4 మొబైల్ వాహనాలు తిరుగుతాయని తెలిపారు. పోలియో రహితను దూరం చేసేందుకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలన్నారు. 0-5 సంవత్సరాల్లోపు పిల్లలందరికీపోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో మహమ్మారిని నిర్మూలించాలని పిలుపునిచ్చారు. 100 శాతం లక్ష్యాన్ని సాధించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీ హెచ్ ఎం ఓ వెంకట రమణ. డాక్టర్ ప్రసన్న. హెల్త్ సెక్రటరీలు. ఆశా వర్కర్లు. తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి పార్టీ తోనే రాష్ట్ర అభివృద్ధి

### నంద్యాల బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 27-. నంద్యాల పట్టణంలో ప్రజాపోరు యాత్ర మంగళవారం మస్జీద్ సెంటర్.. వెంకటాచాలం కాలనీ.. పెద్ద చర్చి.. ఎమ్ ఎస్ నగర్.. మూలసాగరం (ఆంజనేయ స్వామి దేవాలయనీ)ప్రజాపోరు యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అభిరుచి మదు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరగాలంటే బిజెపి ప్రభుత్వం తోనే సాధ్యమవుతుంది ఆయన అన్నారు. పట్టణంలో శిల్పా చేసిన అభివృద్ధి మాటలే తప్ప క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరగలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో . నంద్యాల బీజేపీ పార్టీ పట్టణ అధ్యక్షులు శ్రీ.కశెట్టి చంద్ర శేఖర్ . ప్రజా పోరు కో కన్వీనర్ తాడి రామక్రిష్ణ రెడ్డి. బత్తిని స్వాతి. బసవరాజు. నిమ్మకాయల సుధాకర్. లక్ష్మిరెడ్డి. చెన్నమ్మ. బలరాం. హసినా . బీజేపీ నాయకులు కార్యకర్తలు.. నాయకులు పాల్గొన్నారు.

# సెక్టోరల్ అధికారులు కీలక పాత్ర పోషించాలి

### జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 27-వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సెక్టోరల్ అధికారుల పాత్ర అత్యంత కీలకమైందని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు మంగళవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణపై సెక్టోరల్ అధికారులు, పోలీసు అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు సెక్టోరల్ అధికారులు కీలక పాత్ర పోషించాలన్నారు. భారత ఎన్నికల సంఘం సూచించిన హ్యాండ్ బుక్, మాన్యువల్ ను క్షుణ్ణంగా చదివి ఆ మేరకు ఎన్నికల విధులను తు.చ తప్పకుండా పాటించాలని సెక్టోరల్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ స్టేషన్ లో ఓటర్ల సంఖ్య అధికంగా వుంటే ఆ మేరకు మౌలిక సదుపాయాలను సమకూర్చుకోవాలన్నారు. పోలింగ్ రోజు మాక్ పోల్ నిర్వహణ, ఈవియం, వివి ప్యాట్ల పనితీరు, ఏ చిన్న సంఘటన జరిగినా ఆర్ఓకు ఫిర్యాదు తదితర అంశాలపై పూర్తిస్థాయి శిక్షణ పొంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ అధికారి చేసే ప్రతి పని సెక్టోరల్ అధికారికి తెలిసి ఉండాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ముందస్తుగా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. సెక్టోరల్ అధికారులు, పోలీస్ సెక్టోరల్ అధికారులు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన కలిగి, ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలకు విఘాతం కలిగించే వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. ప్రతిరోజు క్రిటికల్ పోలింగ్ స్టేషన్ లు వున్న గ్రామాలను సందర్శించి, అన్ని వర్గాల ప్రజలతో సమావేశమై ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఈవీఎంల గురించి అవగాహన కల్పించాలి. గత ఎన్నికలలో రీపోలింగ్ జరిగిన పోలింగ్ స్టేషన్ల పై ప్రత్యేక దృష్టి సారించి పకడ్బందీగా వల్నరాబిలిటీ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసి, రిటర్నింగ్ అధికారికి నివేదిక ఇవ్వాలని జెసి పేర్కొన్నారు.

# దివ్యాంగుల సింహగర్జనకు తరలిరండి....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఫిబ్రవరి 27 డోన్ స్థానిక పురపాలక సంఘ ఆవరణంలో పల్లవి మండల దివ్యాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం మంగళవారం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి కర్నూలు, నంద్యాల జిల్లాల దివ్యాంగుల సంఘాల జేఏసీ కార్యనిర్వాహక కార్యదర్శి శివశంకర్, పల్లవి మండల దివ్యాంగుల సమాఖ్య నాయకులు వాసుదేవుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు, అన్ని రాజకీయ పార్టీలు దివ్యాంగులను చిన్నచూపు చూస్తూ వారి హక్కులను చట్టాలను రిజర్వేషన్లను అమలు చేయడంలో అలసత్వం వహించాయనీ, దీనిని నిరసిస్తూ ఈనెల 29వ తేదీ కర్నూలు ఎస్టిబిసి కళాశాల ప్రాంగణంలో వేలాదిమంది దివ్యాంగులతో సింహగర్జన కార్యక్రమాన్ని నిర్వహించి అన్ని రాజకీయ పక్షాలకు కనువిప్పు కలిగేలా చేసి వారి మేనిఫెస్టోలో దివ్యాంగుల సంక్షేమం, సాధికారత, 2016 దివ్యాంగుల హక్కుల చట్టం సంపూర్ణ అమలు లో భాగంగా నిధులు, నియామకాల్లో 5% రిజర్వేషన్, 5% బడ్జెట్ కేటాయింపు, ప్రస్తుత నిత్యావసరాల ధరల దృష్ట్యా దివ్యాంగుల పెన్షన్ 3000 నుండి 6000 రూపాయలకు పెంపు, ప్రతి మండలంలో దివ్యాంగుల సమాఖ్యకు 5 సెంట్లు స్థలం కేటాయించడం, ఎలాంటి షూరిటీ లేకుండా సబ్సిడీ ఋణాల మంజూరు, ఏపీఎస్ఆర్టీసీ నందు దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం వంటి డిమాండ్లతో ఈ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ సభకు మండల పరిధిలో వేలాదిమంది దివ్యాంగులు కదిలి రావాలని పిలుపునివ్వడం జరిగింది. కార్యక్రమంలో పల్లవి మండల దివ్యాంగుల సమాఖ్య కార్యవర్గ సభ్యులు పెద్దన్న, గిడ్డారెడ్డి, గుమ్మకొండ రవి, మహబూబ్ బాషా, మధు, నరేష్, వెంకటేశ్ ఆచారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## సాంజో విద్యార్థికి ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు..



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఫిబ్రవరి 27 హైదరాబాదులో సెయింట్ థామస్ కేథడ్రాల్ చర్చ్ లో ఏర్పాటు చేసిన ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఈవెంట్ లో హల్లేల్ మ్యూజిక్ స్కూల్ విజయవాడ వ్యవస్థాపకులు అగస్టిన్ దండింగి వారి నేతృత్వంలో ఏర్పాటు చేయబడిన 300 మంది విద్యార్థులు గంటపాటు ఎలక్ట్రానిక్ కీబోర్డ్ వాయించి పాటలు పాడడంలో ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కించుకున్నారు. ఇందులో మన డోన్ పట్టణంలోని సాంజో స్కూల్ నందు ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి కొండేపోగు జోనాథన్ ఉండడం గర్వకారణం. అందుకు గాను సానీజో స్కూల్ హెడ్ మిస్సెస్ నిషా ఫిలిప్ మరియు సాంజో స్కూల్ సిబ్బంది జోనాథన్ ను అభినందించారు.

## గాయత్రి మాత ఆలయంలో శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి కి కంచి పీఠాధిపతి పూజలు



కంచి పీఠాధిపతిని అహోబిల దేవస్థానానికి ఆహ్వానిస్తున్న ప్రధాన అర్చకులు, జిపిఏ

ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 27 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీ గాయత్రి మాత ఆలయంలో కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శ్రీ మహా త్రిపుర సుందరి సమేత శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వార్లకు అభిషేకము పూజలు నిర్వహించారు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గాయత్రి మాత ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఆయన అనుగ్రహ భాషణం చేశారు. అక్షింతలతో ఆశీర్వదించారు. అహోబిల దేవస్థానం ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, జిపిఏ సంపత్ లు అహోబిల దేవస్థానానికి విచ్చేయాలని శ్రీ కంచి కామకోటి పీఠాధిపతుల ను కోరారు. బుధవారం సాయంత్రం పీఠాధిపతి స్వామి అహోబిల క్షేత్రానికి వెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ కు మారు పేరు వ్యాయామ ఉపాధ్యాయులు.

### ---జిల్లా విద్యాధికారి సమూయేలు

కర్నూల్ , న్యూస్ కర్నూలు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈరోజు జరిగిన మండల, నియోజకవర్గ కోఆర్డినేటర్స్ తో జిల్లా విద్యా శాఖ అధికారి కె. సమూయేలు గారు సమావేశం ఏర్పాటు చేశారు ప్రతి పాఠశాల లో వ్యాయామ ఉపాధ్యాయులు క్రమశిక్షణ తో విద్యార్థుల ను సక్రమమైన మార్గం లో పెట్టాలని,అందుకు వ్యాయామ ఉపాధ్యాయులు సమర్థులు అని చెప్పారు జిల్లా లో జరిగిన స్కూల్ గేమ్స్ ఆటల పోటీలు,అడుదాం ఆంధ్ర ,ఆటల పోటీలు సమర్థవంతంగా నిర్వహించి జిల్లా కుమంచి పేరు తెచ్చిన ఘనత మన వ్యాయామ ఉపాధ్యాయులదే అని కొనియాడారు. ఎస్.జి.ఫ్. నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయులకు లకు 5000 రూపాయల అందజేయాలని స్కూల్ గేమ్స్ సెక్రటరీ కి తెలియజేశారు. రేపు జరగబోయే స్కూల్ కాంప్లెక్స్ మిటింగ్ నకు అందరూ హాజరై కొత్త కొత్త విషయాలను తీసులుకోవాలని చెప్పారు ఈ కార్యక్రమంలో జిల్లా లోని మండల,నియోజకవర్గ కోఆర్డినెటర్స్శ్రీనివాసులు, శేఖర్, షీరాజ్, వెంకటేశ్వర్లు, సయశ్రీ,చందు నాయక్, అస్లాం, విష్ణువర్ధన్ రెడ్డి, నిర్మల, హరి ప్రసాద్,విజయ్ కుమార్ జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జోసెఫ్ లక్ష్మయ్య పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190